క్లుప్తంగా

న్యాయవాదుల విధుల బహిష్కరణ



సత్తెనపల్లి: న్యాయవాద చట్టం-2025 సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించారు. గుంటూరు జిల్లా బార్ ఫెడరేషన్ పిలుపులో భాగంగా సత్తెనపల్లిలోని నాలుగు న్యాయస్థానాల్లో న్యాయవాదులు న్యాయ దేవత విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. శుక్రవారం కూడా విధులు బహిష్కరణ కొనసాగుతుందని అనిల్‌కుమార్ తెలిపారు. న్యాయవాదులు న్యాయవాద చట్టం -2025 సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బత్తిన శ్రీనివాసబాబు, దివ్వెల శ్రీనివాసరావు, జొన్నలగడ్డ విజయ్‌కుమార్, రాజవరపు శివ నాగేశ్వరరావు, సయ్యద్ అబ్దుల్ రహీం, పాపారావు పాల్గొన్నారు.

టీడీపీకి ఎస్సీ నాయకుడి రాజీనామా



బొక్క సంగీతరావు

సత్తెనపల్లి: టీడీపీ ఎస్సీ విభాగం సత్తెనపల్లి నియోజకవర్గ అధ్యక్ష పదవికి న్యాయవాది బొక్క సంగీతరావు గురువారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా సంగీతరావు మాట్లాడుతూ ఎన్డీఏ కూటమీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి నేటికీ దళిత జాతికి నియోజకవర్గ పరిధిలో సముచిత స్థానం లేదన్నారు. తనను నియోజక వర్గ పరిధిలో దళితులందరూ నామినేటెడ్ పదవుల గురించి అడుగుతున్నారన్నారు. ఇదే విషయంపై సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను చాలాసార్లు అడిగానని, అయినా పట్టించుకోలేదన్నారు. అందుకే తన అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

స్కేటింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



క్రోసూరు: గుంటూరులో నిర్వహించిన అంతర్జిల్లాల ఐసీఈ స్కేటింగ్ పోటీల్లో స్థానిక జై భారత్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల డైరక్టర్ జైనేంద్రరెడ్డి గురువారం తెలిపారు. 13 జిల్లాల నుంచి 600 మంది క్రీడాకారులు పాల్గొనగ జై భారత్ స్కూల్ విద్యార్థులు నలుగురు విజయం సాధించినట్లు చెప్పారు. జి.గౌతమ్, ఎం.బంగారు సుబ్బయ్య, ఎస్డీ అబ్దుల్ హమీద్, ఎస్.సాంబశివరావు బేసిక్ ఇన్ లైన్ బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను డైరెక్టర్, స్కేటింగ్ కోచ్ షేక్ ఖాజా, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ వితరణ



అచ్చంపేట: ప్రతిభతో ఉన్నతస్థాయికి ఎదిగే నిరుపేద విద్యార్థులు ఎందరికో స్నేహహస్తాలు అండగా ఉండటం అభినందనీయమని ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు అన్నారు. బెంగుళూరులోని విశ్వేశ్వరయ్య టెక్నాలజీ యూనివర్శిటీలో బీటెక్‌లో ఫ్రీ సీటు సాధించిన నల్లగట్ల మైథిలికి స్నేహ హస్తాలు ఫౌండేషన్ గురువారం ఎంపీడీవో చేతులమీదుగా రూ.40వేలు విలువ చేసే ల్యాప్‌టాప్ అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ అంబటి రమేష్, స్నేహహస్తాలు కో ఆర్డినేటర్ తాయి కరిముల్లాబాబు, మన్నెం భద్రయ్య పాల్గొన్నారు.

నేడు ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

క్రోసూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో 2013-24లో జరిగిన రూ.6 కోట్ల పనులకు సామాజిక తనిఖీ ప్రజావేదిక శుక్రవారం జరుగుతుందని ఎంపీడీవో జి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్వామా పీడీ, ఏపీడీ, డీఆర్పీలు హాజరువుతారని తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

లారీ బోల్తా

దాచేపల్లి: అతివేగంతో వస్తున్న లారీ బోల్తా పడిన ఘటన గురువారం జరిగింది. హైదరాబాద్ నుంచి గుంటూరు వైపుకి ప్లాస్టిక్ తయారీకి అవసరమైన ముడి సరుకుతో లారీ వెళుతుంది. మండలంలోని గామాలపాడు గ్రామ సమీపంలో అతి వేగం కారణంగా లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ స్వామి లోకేష్, క్లీనర్ బసవ కల్యాణ్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. లారీలోని ముడి సరుకు రోడ్డుపై పడింది. స్థానికులు గమనించి లారీ డ్రైవర్, క్లీనర్‌లను క్యాబిన్ నుంచి సురక్షితంగా బయటకు తీశారు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

కుష్ఠు.. నిర్లక్ష్యం వద్దు

- చాపకింద నీరులా వ్యాప్తి
- సత్తెనపల్లిలో కొత్తగా 5 కేసులు
- ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా వైద్యం
- చికిత్సతో పూర్తిగా నయమవుతుందంటున్న వైద్యులు

సత్తెనపల్లి: కుష్ఠు వ్యాధి చాప కింద నీరులా వ్యాపిస్తోంది. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఇంటింటా సర్వే చేసి వ్యాధి గ్రస్తులను గుర్తించారు. ప్రజలకు అవగాహన కల్పించారు. కాగా ఇంటింటి సర్వేలో కొత్త కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. వ్యాధి నిర్ధారణ అయినవారికి ఆధునిక పద్ధతుల్లో ప్రభుత్వ వైద్యశాలలో వారికి ఉచిత వైద్యం అందిస్తున్నారు. వ్యాధిపై నిర్లక్ష్యం చేయకుండా చికిత్స తీసుకుంటే వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని వైద్యులు చెబుతున్నారు.

కొత్త కేసులు నమోదు

జాతీయ కుష్ఠు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా జనవరి 20 నుంచి ఫిబ్రవరి 12వ తేదీ వరకు ఇంటింటా సర్వే కార్యక్రమం చేపట్టారు. వైద్యులతో పాటు ఆశ కార్యకర్తలు, వలంటీర్లు సర్వేలో పాల్గొన్నారు. సత్తెనపల్లి టౌన్‌లో 17,684 కుటుంబాలుండగా 55,266 మంది జనాభా ఉన్నారు. వీరిని సర్వే చేసేందుకు 15 టీమ్‌లు(ఆశ కార్యకర్త, మేల్ వలంటీర్) నియమించారు. సత్తెనపల్లి రూరల్‌లో 22,059 కుటుంబాలుండగా 78,956 మంది జనాభా ఉన్నారు. వీరిని సర్వే చేసేందుకు 59 టీమ్‌లు నియమించారు. సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్‌లో 100 శాతం ఇంటింటా సర్వే చేసి కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించారు. సత్తెనపల్లి టౌన్‌లో పాత కేసులు నాలుగు ఉంటే కొత్తగా మరో కేసు నమోదైంది. సత్తెనపల్లి రూరల్‌లో పాత కేసు ఒకటి ఉండగా కొత్తగా నాలుగు కేసులు గుర్తించారు.



పట్టణంలోని వడ్డవల్లిలో ఇంటింటి సర్వేలో వైద్య సిబ్బంది



పట్టణంలోని వెంగళరెడ్డినగర్‌లో ఇంటింటి సర్వే

ఎండీటీ చికిత్సతో వ్యాధి దూరం...

అంగవైకల్యం వచ్చిన వారికి ప్రభుత్వమే ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తారు. అనంతరం వారికి రెండు నెలలపాటు రూ. 12 వేల ఆర్థిక సాయం కూడా ప్రభుత్వమే అందిస్తుంది. బహుళ ఔషధ చికిత్సతో కుష్ఠును పూర్తిగా నయం చేయవచ్చు. దాదాపు రూ.15 వేల నుంచి రూ.20వేల వరకు ఖర్చు అయ్యే మందులను ప్రభుత్వమే ఉచితంగా అందిస్తోంది. వ్యాధిపై అవగాహన కలిగి ఉండి డాక్టర్లను సంప్రదించి తగిన సలహాలు, సూచనలను తీసుకొని మందులను వాడితే వ్యాధి నయమవుతుంది.

వ్యాధి లక్షణాలు..

కుష్ఠు మైకో బాక్టీరియం లేప్రే అనే బాక్టీరియా వల్ల వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి చర్మానికి, నరాలకు పాకుతుంది. ఈ వ్యాధి బారిన పడిన వారి శరీరంపై చిన్నవి లేదా పెద్ద మచ్చలు కనిపిస్తాయి. పాలిపోయిన రాగి లేదా ఎరుపు రంగులో ఉంటాయి. ఆ మచ్చలో ముఖ్యంగా స్పర్శ ఉండదు. నొప్పి తెలియదు. సకాలంలో చికిత్స పొందకపోతే కాళ్లు, చేతులు నిస్సత్తువ ఏర్పడి వైకల్యానికి దారి తీస్తుంది.

చికిత్స ఇలా...

కుష్ఠును రెండు రకాలుగా గుర్తించి చికిత్స అందిస్తారు. వ్యాధి సోకిన వ్యక్తికి ఒకటి నుంచి ఐదు మచ్చల కంటే ఎక్కువ ఉంటే వారిని మల్టీ బ్యాసిల్లరీగా అంటే అంటు వ్యాధి లక్షణాలుగా గుర్తిస్తారు. చికిత్స తీసుకొని కనీసం 12 నెలల పాటు మందులు వాడాలి. ఒకటి లేదా ఐదు మచ్చలు ఉంటే వారిని పాసీ బ్యాసిల్లరీగా .. వ్యాప్తి లేని లక్షణాలుగా గుర్తిస్తారు. మీరు 6 నెలల పాటు చికిత్స తీసుకొని మందులను వాడుతూ ఉండాలి. ముఖ్యంగా పాదాలు పొడిగా ఉన్నప్పుడు వంట నూనె లేదా వ్యాజిలైన్ పూసుకోవాలి. పాదాలకు సురక్షితమైన పాదరక్షలు ఉపయోగించుకోవాలి. కుష్ఠు వ్యాధిగ్రస్తుల పాదాలు గాని చేతులు గాని స్పర్శ లేని ప్రాంతాన్ని రోజు అరగంట పాటు నీటిలో ముంచి ఉంచాలి. గాయాలు ఏర్పడితే క్రమం తప్పకుండా సబ్బు నీటితో శుభ్రం చేసుకోవాలి.

ఆందోళన చెందాల్సిన పని లేదు



కుష్ఠుపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. చర్మవ్యాధులకు సంబంధించి అనుమానాలు ఉంటే వైద్యులను సంప్రదించాలి. వ్యాధిని పరీక్ష చేసి ఉచితంగా చికిత్స అందిస్తారు. డబ్ల్యూహెచ్ఓ తయారు చేసిన మందులను ఉచితంగా అందిస్తారు. వైద్యుల సలహాల మేరకు మందులను వాడితే పూర్తిగా నయం చేసుకోవచ్చు.

–డి.నాగేశ్వరరావు నాయక్, డీపీఎంఓ

అంగన్‌వాడీలకు ముగిసిన శిక్షణ తరగతులు



ముగింపు ప్రదర్శనలో అంగన్‌వాడీ కార్యకర్తలు



మాట్లాడుతున్న ఎంఈఓ మల్లికార్జున శర్మ



మాట్లాడుతున్న ఎంఈఓ-2 సీతారామిరెడ్డి



మాట్లాడుతున్న ఎంఈఓలు

పెదకూరపాడు: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు రెండు రోజులుగా జరుగుతున్న జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. సూపర్‌వైజర్ షేక్ మున్ని మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెట్టాలని సూచించారు. చిన్నారులకు, కిశోర్ బాలికలకు పోషక విలువలతో కూడిన ఆహారం, పూర్వ విద్యపై అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన ప్రదర్శన నిర్వహించారు.

నైపుణ్యాలు మెరుగుపరచాలి..

రాజుపాలెం: పిల్లల్లో సమగ్ర అభివృద్ధిని పెంపొందించాలని మండల విద్యాశాఖధికారి బి.మల్లికార్జునశర్మ సూచించారు. గణపవరం జిల్లా పరిషత్ పాఠశాలలో జ్ఞానజ్యోతి కార్యక్రమంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు రెండవ రోజు శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. శిక్షణలో మండల విద్యాశాఖాధికారి మాట్లాడుతూ 0-6 ఏళ్ల లోపు పిల్లలకు అభివృద్ధితోపాటు నైపుణ్యాలను మెరుగుపరచాలని తెలిపారు. సీడీపీవో టి.శ్రీలత, ఏసీడీపీవో టి.సంతోషకుమారి, సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అచ్చంపేట: ఇకపై అంగన్వాడి సెంటర్స్ ఫౌండేషన్ సెంటర్స్‌గా పరిగణించబడుతాయని మండల విద్యాశాఖాధికారి ఏకుల ప్రసాదరావు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలులో జరుగుతున్న జ్ఞానజ్యోతి ట్రైనింగ్ కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొన్నారు. పౌష్టికాహారం, ఆటపాటలతో విద్యా బోధన పిల్లలకు విద్యపై ఆశక్తి కలగడానికి దోహదపడతాయని చెప్పారు. సూపర్‌వైజర్స్ మహిమున్నిసా, మాణిక్యం, రిసోర్స్ పర్సన్స్ మహబూబ్‌సుభాని, బాలగంగాధర్‌రావు పాల్గొన్నారు.

ముప్పాళ్ళ: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి 120డే సర్టిఫికెట్ కోర్సు లో భాగంగా మొదటి విడత ముగింపు శిక్షణ కార్యక్రమం గురువారం జరిగింది. ఎంఈఓ-2 సీతారామిరెడ్డి పాల్గొని అంగన్‌వాడీకేంద్రాల ద్వారా సమగ్ర అభివృద్ధి కృత్యాలపై అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలచే ప్రాక్టీస్ చేయించారు. కార్యక్రమంలో డీఆర్పీ సుభాని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.అనంతలక్ష్మి, ఎసీడీపీఓ టి.సంతోషి కుమారి, సీఆర్పీ టి.ఉదయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అభ్యాసన సామర్థ్యాలు మెరుగుపరచాలి

సత్తెనపల్లి: చిన్నారులలో అభ్యసన సామర్థ్యాలు మెరుగు పరచాలని మండల విద్యాశాఖ అధికారి-1 అనంతవరం శ్రీనివాసరావు అన్నారు. జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి పై అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న శిక్షణలో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ శిక్షణ తరగతులను అంగన్‌వాడీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల విద్యాశాఖ అధికారి-2 ఏ.రాఘవేంద్రరావు మాట్లాడుతూ ప్రత్యేక శిక్షణ తరగతులు ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తలు మెరుగైన విధివిధానాలను అవలంబించాలన్నారు. అనంతరం డీఆర్పీలు గా వ్యవహరించిన ఐసీడీఎస్ సూపర్వైజర్ పి.ప్రమీల, హాఫీజ్, విజయభాస్కరరావు అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు.

వైభవంగా వాసవీమాత వార్షికోత్సవాలు

అచ్చంపేట: స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయం 29వ వార్షికోత్సవ వేడుకలు రెండవ రోజు గురువారం సుప్రభాత సేవతో ప్రారంభమయ్యాయి. కుంకుమార్చనలు నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి ప్రారంభమైన అమ్మవారి నామ సంకీర్తన ఏకాహ పారాయణ పూర్తయింది. అనంతరం శ్రీలలితా సహస్రనామ స్తోత్ర పారాయణం, క్షీర కలశాల గ్రామోత్సవం, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. క్షీర కలశాలతో అమ్మవారి ఉత్సవమూర్తికి అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఆర్యవైశ్య సమారాధన నిర్వహించారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి, అమ్మవారి ఉత్సవాలలో పాల్గొన్నారు. నిర్వహకులు సూరే సుబ్బారావు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



క్షీర కలశాలతో గ్రామోత్సవంలో మహిళలు

'పరివర్తన' ఆశ్రమ పాఠశాలకు నగదు విరాళం

సత్తెనపల్లి: పట్టణంలోని పరివర్తన దివ్యాంగుల ఆశ్రమ పాఠశాల భవనం 24 యూనిట్లు శ్లాబ్‌కి, ఫ్లోరింగ్ ఇతర మరమ్మతులు చేపట్టారు. ఇందుకు రూ.85 వేలను అమరావతి మండలం ఉంగుటూరు గ్రామానికి చెందిన గుండవరపు వెంకటరావు జ్ఞాపకార్థం అమెరికాలో ఉంటున్న వారి కుమారుడు, కోడలు గుండవరపు అనిల్ కుమార్, జయశ్రీ విరాళమిచ్చినట్లు పరివర్తన నిర్వాహకుడు కొరబండ కిషోర్ బాబు గురువారం తెలిపారు. దాతలకు, సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. నిర్వాహకులు ఏకుల మేరీ, సొంగా కుసుమకుమారి ఉన్నారు.

అడ్మిషన్లకు టాలెంట్ టెస్ట్‌లతో వల

సత్తెనపల్లి: నారాయణ విద్యా సంస్థలో అడ్మిషన్లకు టాలెంట్ టెస్టులు నిర్వహించడం చట్ట వ్యతిరేకమని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్స్ అసోసియేషన్ సత్తెనపల్లి అధ్యక్షుడు ఎస్కె మహబూబ్ సుభాని ఆరోపించారు. సత్తెనపల్లిలోని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్స్ అసోసియేషన్ యాజమాన్యాలు పట్టణంలోని శ్రీ రాఘవేంద్ర బాల కుటీర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గురువారం సమావేశం నిర్వహించాయి. ఈ సందర్భంగా సుభాని మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ఇతర విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్‌లు చేసి, కల్పితాలతో విష ప్రచారం చేస్తున్నారని అన్నారు. నారాయణ విద్యా సంస్థ మరో అడుగు ముందుకు వేసి టాలెంట్ టెస్ట్ పేరుతో మార్కుల ప్రాతిపదికన ఫీజులో రాయితీలు ఇస్తామని ప్రకటిస్తోందన్నారు. ఈ విషయాన్ని సత్తెనపల్లి ఉప విద్యాశాఖ అధికారి, మండల విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకుని వచ్చామన్నారు. ఆ టాలెంట్ టెస్ట్‌ను నిలుపుదల చేయాల్సిందిగా కోరామని చెప్పారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని కోరారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భవనం నాగిరెడ్డి, అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు వెలుగూరి సుబ్బారాయుడు, కార్యదర్శి జి.శివకుమార్‌రెడ్డి, కోశాధికారి ఎస్.రామారావు, ఐ.శ్రీధర్, సత్తెనపల్లిలోని 25 పాఠశాలల యాజమాన్యాలు పాల్గొన్నాయి.

రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యకు నమోదు చేసుకోండి

క్రోసూరు: మండలంలోని బయ్యవరం గ్రామంలో రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యపై రైతులకు గురువారం అవగాహన కార్యక్రమం ఏవో వేణుగోపాల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఈ ఏడాది నుంచి వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ పథకాలను పారదర్శకంగా, సులభతరంగా చేసేందుకు.. వెబ్ ల్యాండ్ లో పొలం ఉన్న ప్రతి రైతుకు 'విశిష్ట గుర్తింపు సంఖ్య' ను ఇస్తున్నట్లు చెప్పారు. ఈ సంఖ్య కలిగిన రైతులకు మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు అనగా పీఎం కిసాన్, పంట రుణాలపై వడ్డీ రాయితీ, క్రాప్ ఇన్సూరెన్స్, ఇన్ పుట్ సబ్సిడీ, అన్నదాత సుఖీభవ, రాయితీపై యంత్ర పరికరాలు, సూక్ష్మ నీటి సేద్య పరికరాలు మొదలగు పథకాల లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రత్యేక గుర్తింపు సంఖ్యను పొందుటకు రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏవో వేణుగోపాల్

ఓటు హక్కు వినియోగించుకోవాలి

ముప్పాళ్ళ: గ్రాడ్యుయేట్‌లు ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఉమ్మడి కృష్ణ-గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం కార్యక్రమంలో భాగంగా ఆయన గురువారం మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. జెడ్పీ హైస్కూల్, గోళ్లపాడు కేజీబీవీ పాఠశాల, మాదల, ఇరుకుపాలెం గ్రామాల్లో పట్టభద్రుల ఓటర్లను కలిసి కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాను గెలిపించాలని కోరారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాల రూపకల్పన చేయబోతున్నామని చెప్పారు. ప్రతి గ్రాడ్యుయేట్ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ముప్పాళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతోను, శిక్షణకు హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలతోను సమావేశమయ్యారు. ఎన్నికల పరిశీలకులు తాతా జయప్రకాశ్‌నారాయణ, వేములకొండ శ్రీనివాస్, పార్టీ మండల నాయకులు గోగినేని కోటేశ్వరరావు, బత్తుల నాగేశ్వరరావు ఉన్నారు.



జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా

పశు బీమాతో రైతుకు ధీమా

అచ్చంపేట: ప్రకృతి వైపరిత్యాలతో మృత్యువాత పడే పశువులకు బీమా చేసి నష్టాల ఊబి నుంచి రక్షణ పొందాలని పశువైద్యాధికారి డాక్టర్ స్వాతీదేవి తెలిపారు. గురువారం అచ్చంపేటలో ఆమె రైతులకు పశు బీమా పథకం గురించి వివరించారు. పశువులు, మేకలు, గొర్రెలకు రూ.30 వేల నుంచి రూ.1.20లక్షల వరకు బీమా పొందే అవకాశాలున్నాయన్నారు. ఒక్కసారి బీమా ప్రీమియం చెల్లించిన రైతులు మూడేళ్ల వరకు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. 5 గేదెల వరకు బీమా పథకాన్ని వినియోగించుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు సమీపంలోని పశువైద్యశాలలో సంప్రదించాలని తెలిపారు.

సస్యరక్షణతో మిర్చిలో అధిక దిగుబడులు

డాట్ సెంటర్ కో–ఆర్డినేటర్ నగేష్

బెల్లంకొండ: మిరప పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని డాట్ సెంటర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.నగేష్ తెలిపారు. గురువారం మండలంలోని మాచాయపాలెం గ్రామంలో మిరప రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మిరపలో నల్ల తామర పురుగు నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. మండల ఉద్యాన శాఖ అధికారి వై.మోహన్ మాట్లాడుతూ మండలంలో నేలలు పండ్ల తోటలకు అనువుగా ఉంటాయన్నారు. నీటి వసతి ఉన్న భూములలో డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిలో పామాయిల్ సాగు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యాల్యూ ఆయిల్స్ అండ్ గ్యాస్ సర్వీసెస్ కంపెనీ వైస్ చైర్మన్ రామ్మోహన్, గ్రామ ఉద్యాన అసిస్టెంట్ ప్రత్యూష, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగహన కల్పిస్తున్న అధికారులు

లలిత అమ్మవారి 9వ వార్షికోత్సవం

మాచర్ల: పట్టణంలో వేంచేసియున్న సత్యసాయిబాబా దేవాలయంలో ఉన్న లలిత అమ్మవారి 9వ వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. ముందుగా షిర్డీసాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం లలిత అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. మహిళలు దేవాలయంలో అమ్మవారిని దర్శించుకొని పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం పట్టణంలో కలశ శోభాయాత్ర గాయత్రీ దీప మహాయజ్ఞం సందర్భంగా స్థానిక కోదండ రామాలయం నుంచి శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి దేవాలయం వరకు 108 కుండీ జ్ఞాన గాయత్రీ మహాయజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అఖిల విశ్వ గాయత్రీ పరివార్–శాంతికుంజ్– హరిద్వార్ మాచర్ల వారి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.

రోడ్డుకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్

ముప్పాళ్ళ: మండలంలోని లంకెల కూరపాడు గ్రామానికి వెళ్లే రహదారిపై ఏర్పడిన గుంతలను ఆర్ అండ్ బీ అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఈ నెల 20న సాక్షి పత్రికలో ముప్పాళ్ల నుంచి లంకెలకూరపాడు రోడ్డు పై నెల గడవక ముందే తారు లేచి కంకర బయటపడుతుండంటూ 'ఇవేనా మరమ్మతులు?' అంటూ ప్రచురితమైన ఫోటో కథనానికి ఆర్ అండ్ బీ శాఖ అధికారులు స్పందించారు. వెంటనే మరమ్మతులు చేపట్టి తారు లేచి కంకర రాళ్లు బయయటపడిన ప్రాంతాన్ని మరలా తారు వేసి గుంతను పూడ్చి వేశారు.



కవ్వింపు చర్యలు తగవు..

క్రోసూరు: గురజాల నియోజకవర్గం దాచేపల్లిలో బుధవారం చత్రపతి శివాజీ మహారాజ్ జయంత్యుత్సవాల సందర్భంగా నిర్వహించిన ర్యాలీపై అసాంఘిక శక్తుల రాళ్లదాడి, కవ్వింపు చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, అలాగే దోషులను కఠినంగా శిక్షించాలని శివసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వినోదుల నరసింహరావు డిమాండ్ చేశారు. గురువారం క్రోసూరు లో ఏర్పాటు చేసిన విలేకరులతో సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యను సమయస్ఫూర్తితో వ్యవహరించిన పోలీస్ యంత్రాంగానికి, ఉన్నతాధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకొని నిందితులని కఠినంగా శిక్షించాలని కోరారు. ముందుగా చత్రపతిశివాజీ చిత్రపటానికి పూలమలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల అధ్యక్షులు రాజశేఖర్, వానర సేన అధ్యక్షుడు దేరంగ శ్రీనివాసరావు, హిందూ సంఘాల ప్రతినిధులు బాలకృష్ణ పాల్గొన్నారు.



శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శివసేన, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు

శానిటేషన్ సామగ్రి పంపిణీ

నకరికల్లు: ప్రజారోగ్యం కాపాడుతున్న గ్రీన్ అంబాసిడర్‌ల ఆరోగ్యం కోసం శానిటేషన్ సామగ్రి పంపిణీ చేస్తున్నట్లు ఈఓపీఆర్డీ కె.వి.శివప్రసాద్ అన్నారు. నకరికల్లు పంచాయతీ సిబ్బంది, గ్రీన్ అంబాసిండర్‌లకు శానిటేషన్ సామగ్రిని సర్పంచ్ పరసా అంజమ్మ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొబ్బరినూనె, సబ్బులు, సర్ఫ్ ప్యాకెట్లు, చెప్పులు తదితర సామగ్రి పంపిణీ చేశామన్నారు. వాటిని వాడే విధానం, చెత్త సేకరించే పనిపూర్తయ్యాక తీసుకోవాల్సి పరిశుభ్రతాపరమైన జాగ్రత్తలను వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



సామగ్రి పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఈఓపీఆర్డీ

క్రమశిక్షణ కలిగిన విద్యతోనే ఉన్నత శిఖరాలకు

ఎంఈఓ–2 శివనాగేశ్వరరావు

రెంటచింతల: ప్రతి విద్యార్థి క్రమశిక్షణ కలిగిన విద్యను పట్టుదలతో అభ్యసించినప్పుడే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని ఎంఈఓ-2 వై.శివనాగేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతులను, రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ మీకు ప్రతి రోజు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా... మీ క్లాస్‌లో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు... మీలో ఎవరైనా 5వ ర్యాంక్‌లోపు ఉన్నారా... మీకు ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠాలు అర్థమవుతున్నాయా... స్టడీ అవర్స్ జరుగుతున్నాయా... మీ దగ్గరకు డాక్టర్ వస్తున్నారా... పాఠశాలలో ఇంకా ఏమైనా మెరుగైన సౌకర్యాలు కల్పించాలా అని ఎంఈఓ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అందరూ ఇష్టంతో ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని అప్పుడే తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చి సమాజంలో మంచి స్థానంలో ఉంటారని అన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సింహాద్రి మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఎంఈఓ-2 శివనాగేశ్వరరావు

